జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



సోమవారం | 17-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 757 పేజీలు: 4 వెల : రూ.7


# తప్పుడు సర్వే నెంబర్లతో..

# భూములు స్వాహా

* సర్వే నంబర్లు తారుమారు.. కొత్త హక్కులు సృష్టిస్తున్నారు
* శ్రీకాకుళంలో రెచ్చిపోతున్న భూ రాబందులు
* పక్కా రికార్డులున్నా లబోదిబోమంటున్న బాధితులు
* తాజాగా టి.పి.ఎం.హెచ్. స్కూల్ సమీపంలో 25 సెంట్లు కబ్జాకు యత్నం
* అసలు యజమానులుండగానే తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు
* గతంలో పోలీసు ఫిర్యాదులు.. అయినా ఆగని మాఫియా తీరు
* వరుస ఘటనల్లో ట్యాంపరింగ్ చేస్తున్నవారు అరెస్టు అవుతున్నా భయపడని ముఠాలు



శ్రీకాకుళం, ఆగస్టు 16 (జాతీయ వార్త): శ్రీకాకుళం నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నకిలీ పత్రాలు, తప్పుడు వారసత్వ ధ్రువీకరణలు, రెవెన్యూ రికార్డుల తారుమారుతో కోట్ల రూపాయల విలువైన భూములను కాజేస్తున్న భూమాఫియా దందాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. సాక్షాత్తు జిల్లా ఎస్పీయే రంగంలో దిగి ఈ ముఠాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా స్థానిక టి.పి.ఎం.హెచ్. స్కూల్ సమీపంలో 1.37 ఎకరాల (ఆర్ఎస్ నెంబర్ 248/3, టీఎస్ నెంబర్ 377/3) కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని తప్పుడు సర్వే నంబర్లతో అక్రమంగా విక్రయించిన ఘటన తాజాగా జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపుతోంది.

### సర్వే నంబర్లు మార్చి దందా..
### అసలు యజమానులకు బెదిరింపులు!

శ్రీకాకుళం నగరంలోని కస్పా వీధికి చెందిన కస్పా వెంకటలక్ష్మీదేవి కుటుంబానికి వారి తాతముత్తాతల నుంచి రెవెన్యూ సర్వే నంబర్ 248/3, టౌన్ సర్వే నంబర్ 377/3 పరిధిలో టి.పి.ఎం.హెచ్.స్కూల్ సమీపంలో 1.37 ఎకరాల చట్టబద్ధమైన స్థలం ఉంది. ఈ స్థలానికి సంబంధించి రెవెన్యూ అడంగల్, భూమి శిస్తు రశీదులు, మున్సిపల్ టాక్స్ ఎండార్స్‌మెంట్లు, సర్వే నివేదికలన్నీ పక్కాగా ఉన్నాయి. అయినా వాటిని ధ్రువీకరించుకోవడానికి ఇటీవల సమాచార హక్కు చట్టం-2005 ద్వారా దరఖాస్తు చేయగా అన్ని సరిపోలాయి. ఎంఆర్ఓ ఇచ్చిన ధ్రువీకరణ ఆధారంగా జూన్ 1, 2026న శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (డాక్యుమెంట్ నెం. 2930/2026) రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. అయితే, ఈ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేని కస్పా రమాప్రభు అనే వ్యక్తికి టీఎస్ నెంబర్ 377/3లో (ఆర్ఎస్ నెంబర్ 248/3) ఎకరా 1.37 సెంట్లలో ఒక్క సెంట్ భూమి కూడా తన పేరిట లేకపోయినా, ఈ 0.25 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేశాడు. జిల్లా పరిషత్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న వేరే భూమికి చెందిన తప్పుడు సర్వే నంబర్లు (ఆర్ఎస్ నెంబర్. 248/1, టీఎస్ నెంబర్. 377/1) వేసి ఐదుగురు అమాయకులకు విక్రయించేశాడు.

### రుణం కోసం వెళ్తే బయటపడ్డ గుట్టు..

విక్రయించిన భూమి కొనుగోలుదారులలో ఒకరైన ముంగి మల్లమ్మ బ్యాంక్ రుణం కోసం వెళ్లగా, సర్వే నంబర్ తప్పుగా ఉందని అధికారులు



తిరస్కరించారు. దీంతో ఉలిక్కిపడ్డ కబ్జాదారులు, రబ్బరు స్టాంపులు కూడా లేకుండానే టీఎస్ నెంబర్. 377/3 అని తప్పుడు సవరణ సర్టిఫికేట్ (సవరణ డాక్యుమెంట్ నెం. 445/2011) సృష్టించి రిజిస్ట్రేషన్ చేసేశారు. రమాప్రభు గతంలోనూ సర్వే నంబర్లు మార్చి డాక్యుమెంట్ నెం. 2801/2006 (రేవతి పాండ్యా), 2395/2007 (తర్రా ఇందు), 506/2004 (కంశు పాపారావు), 4353/2005 (అందవరపు శంకరనారాయణ), 2719/2001 (ముంగి మల్లమ్మ) ద్వారా అక్రమ క్రయవిక్రయాలకు పాల్పడినట్లు రికార్డులు స్పష్టంగా బయటపడ్డాయి. అవన్నీ అక్రమంగా చేసినవేనని తెలుస్తోంది. ఆ స్థలం వద్ద తన పేరు, ఫోన్ నంబర్లు రాస్తూ బోర్డు పెట్టి అసలు



యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తూ, క్రయవిక్రయాలు జరగకుండా రమా ప్రభు అడ్డుపడుతున్నాడు. ఈ అక్రమాలపై బాధిత కుటుంబంతో పాటు గతంలో అప్పన్న పట్నాయక్ అనే వ్యక్తి కూడా పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్ టౌన్ పోలీసులు రసీదు నెంబర్ 353/2023 కూడా ఇచ్చారు. ఇదే విషయమే గతంలో పలు పత్రికలలో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఎఫ్ఐఆర్ అయితే నమోదయింది గాని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాటి నుంచి నేటి వరకు ఈ మాఫియాపై కఠిన చర్యలు లేకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### జిల్లా వ్యాప్తంగా కబ్జాదారుల పంజా..
### గతంలోనూ అనేక ఉదంతాలు

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో భూమాఫియా విచ్చలవిడిగా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులపై పడుతోంది. అందులో భాగంగానే.. మాజీ స్పీకర్ కుటుంబం కేసు. చాపురం వద్ద రూ. 3 నుంచి రూ. 4 కోట్ల విలువైన ప్లాట్లను (84, 85, 86) కబ్జా చేసేందుకు అసలు యజమాని బతికి ఉండగానే నకిలీ మరణ, వారసత్వ ధ్రువీకరణలు సృష్టించారు. ఈ కేసులో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు, సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లతో సహా 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

### ఎస్‌బీఐ కాలనీలో ప్రభుత్వ భూమి కొల్లగొట్టుడు..

ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ లేఅవుట్‌లోని 11 సెంట్ల ప్రభుత్వ రిజర్వుడ్ స్థలాన్ని (విలువ రూ. 3 కోట్లు) తహసీల్దార్ సంతకాలు, ముద్రలు ఫోర్జరీ చేసి దొంగ పొజెషన్ సర్టిఫికేట్లతో కాజేసేందుకు యత్నించిన వజ్జా కుటుంబీకులు, జూనియర్ అసిస్టెంట్ సహా 9 మందిని అరెస్టు చేశారు. రాగోలు పరిధిలో 'ధర్మాన' ఇంటి పేరుతో ఉన్న స్థలంలోకి అక్రమంగా చొరబడి రాత్రికి రాత్రే ఫెన్సింగ్ వేయడానికి యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అలాగే అక్కడి 'రాగోలు పెద్ద చెరువు' మఠం భూములు కూడా ఆక్రమణకు గురవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి కోర్టు వివాదాలు లేని తమ స్థలానికి అన్ని రకాల మున్సిపల్, రెవెన్యూ రికార్డులు పక్కాగా ఉన్నప్పటికీ, తప్పుడు సర్వే 248/1 నెంబరు, టీఎస్ నెంబర్ 377/1 తో (ఇది జిల్లా పరిషత్ క్వార్టర్స్ పరిధిలో ఉన్నది) రిజిస్ట్రేషన్ చేసేసి, ఇప్పుడు తాజాగా మరో 5 సెంట్లుపై కన్నేసి, అసాంఘిక శక్తులతో వాటికి కాంపౌండ్ వాల్ నిర్మించేసి దౌర్జన్యానికి దిగుతున్న కస్పా రమాప్రభుపై పోలీసులు, రెవెన్యూ అధికారులు తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు జిల్లా ఎస్పీని వేడుకుంటున్నారు.

## సర్దార్ లచ్చన్న..

# ఆశయ సాధనే ధ్యేయం

* జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్
* ఘనంగా గౌతు లచ్చన్న 117వ జయంతి ఉత్సవాలు
* నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

శ్రీకాకుళం, ఆగస్టు 16(వార్త): వెనుకబడిన తరగతుల సంక్షేమం, హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన బహుజన నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలకు కలెక్టర్, శాసనసభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, లచ్చన్న కుమారుడు గౌతు శ్యాంసుందర్ శివాజీ ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర కాలంలో శ్రీకాకుళం నుంచి మద్రాసు వరకు పాదయాత్ర చేపట్టి బీసీల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ సమర్థవంతంగా చేరవేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు.దేశంలో సర్దార్ అనే బిరుదుకు పూర్తి న్యాయం చేసిన మహానాయకులు సర్దార్ వల్లభభాయ్ పటేల్, సర్దార్ గౌతు లచ్చన్న మాత్రమేనని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అభివర్ణించారు. ఆచార్య ఎన్జీ రంగాలాంటి మహనీయులతో లచ్చన్నకు ఉన్న సాన్నిహిత్యం, గురువుల పట్ల ఆయన చూపిన భక్తి



భావితరాలకు ఆదర్శమని స్మరించుకున్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, తాను లచ్చన్న శిష్యుడినని, ఆయన వద్ద నుంచే రాజకీయ క్రమశిక్షణను నేర్చుకున్నానని వెల్లడించారు. లచ్చన్న చూపిన బాటలోనే పయనిస్తూ సామాజిక సమానత్వం కోసం శ్రమిస్తామని ఆయన కుమారుడు, మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర్ శివాజీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

అంతకుముందు డే నైట్ కూడలిలో లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆడిటోరియంలో రచన జీవిత చరిత్రను తెలిపే ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హరిఓం పాండియా, ఆర్డీవో సాయి ప్రత్యూష, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విశ్వప్రసాద్, ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పి ఎం జె బాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధ, పలువురు నాయకులు, శ్రీశయన సంఘ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## శ్రీకాకుళం

## ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న

**✻ బీసీల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు ✻ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి, ఆగస్టు 16 (వార్త):** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళు లర్పిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతో పాటు, భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని మంత్రి పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమం కోసం ఆయన సాగించిన ఉద్యమాలు చిరస్మరణీయమన్నారు.బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన మహనీయుడిగా ఆయన చేసిన సేవలు ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, బడుగు వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన లచ్చన్న ఆశయాలను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సూచించారు.సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన సర్దార్ గౌతు లచ్చన్న సేవలు, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న ఆశయసాధనకు కృషి చేయాలి

**మందస, బాలిగాం, హరిపురంలో లచ్చన్న జయంతి వేడుకలు**



**మందస, ఆగస్టు 16(వార్త):**స్వాతంత్ర్యసమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల నాయకుడు, సర్ధార్ గౌతు లచ్చన్న ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని బాలిగాం-హరిపురం జంక్షన్, మందసలలో సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మందస మండలంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బావన దుర్యోధన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, రైతుల సంక్షేమం కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ముందుగా బాలిగాం-హరిపురం జంక్షన్ వద్ద లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం నాయకులు మందస పట్టణంలోని లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు, కార్యకర్తలు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో మందస మండల కూటమి నాయకులు, కార్యకర్తలు సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, గౌతు కుటుంబ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చైతన్య దీపిక ఆధ్వర్యంలో సర్దార్ జయంతి

**31 మంది గీత కార్మికులకు ఘన సన్మానం**



**సోంపేట, ఆగస్టు16 (వార్త):** తరతరాలుగా గీత వృత్తిని నమ్ముకుని కుటుంబాలను నెట్టుకువస్తున్న గీత కార్మికులను సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా సోంపేటలో ఆదివారం శ్రీ శయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత జడ్జి చిరంజీవులు, విశిష్ట అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్ హాజరై 31 మంది గీత కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు ఈత చెట్లు పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కష్టజీవుల పట్ల ప్రభుత్వాలు కనికరం చూపాలని అన్నారు. ఈ వృత్తిలో ఎన్నో వ్యయప్రయాసలు ఉన్నాయని వాటిని అధ్యయనం చేసి వారు పడుతున్న వేదన పట్ల కరుణ చూపుతూ వారి సంక్షేమానికి, శ్రేయస్సుకు తగు విధమైన ప్రోత్సాహకాలు అందజేయాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమంలో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి సర్దార్ గౌతు లచ్చన్న సమరయోధుడిగా పోషించిన పాత్ర అమోఘమని అన్నారు. రైతులు, కార్మికులు, వెనుకబడిన తరగతుల ప్రజల కోసం నిరంతరం పోరాటం నడిపిన మహానుభావుడని కొనియాడారు. ఎన్నో ఉద్యమాలకు ఈ ప్రాంతంలో నాయకత్వం వహించి తెల్ల దొరల పాలిట సింహ స్వప్నంగా ఉన్నతమైన పోరాట పటిమతో స్వాతంత్ర్య సాధనలో కృషి చేసిన ధీరుడు అని లచ్చన్నను అభివర్ణించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏటా లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తున్న చైతన్య దీపిక సంస్థను అభినందించారు. సోంపేటలో లచ్చన్న విగ్రహం వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. లచ్చన్న జయంతి పురస్కరించుకొని చైతన్య దీపిక విశిష్టమైన కార్యక్రమాన్ని రూపొందించింది. ఇచ్చాపురం నుంచి మందస వరకు వివిధ గ్రామాల నుంచి ప్రస్తుతం గీత వృత్తి నిర్వహిస్తున్న సీనియర్ కార్మికులను ఆహ్వానించి 31 మందిని ఘనంగా సన్మానించింది. సన్మాన గ్రహీతలకు దుశ్శాలువ కప్పి బహుమతులు అందజేశారు. దేవాడ మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుద్ది వీరరాజు, ఉపాధ్యక్షులు బీన ఆనందరావు, పొడుగు కామేష్, దుద్ది శ్రీనివాస్, బల్ల జానకిరావు, బంజు లోకనాథం, జాక కేశవరావు, దూగాన లోకనాథం, బల్ల బాబురావు, పైల గిరి, బొర్ర మాధవరావు, కోళ్ల తులసి, ఆణింగి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అకాడమిక్ ఇన్స్ట్రక్టర్స్ పోస్టులు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**మందస, ఆగస్టు 16(వార్త):** మందస మండలంలో ఖాళీగా ఉన్న అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మందస మండల విద్యా శాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు చెప్పారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మందస మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన తొమ్మిది అకాడమిక్ ఇన్స్ట్రక్టర్స్ పోస్టులు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. పోస్టుల వారీగా మందస హైస్కూల్‌లో ఎస్ఎస్ తెలుగు మీడియం, బయాలజీ ఒరియా మీడియం, ఇంగ్లీషు, సొండిపూడి హైస్కూల్ లో సోషల్ స్టడీస్, జీఆర్ పురం హైస్కూల్‌లో సోషల్ స్టడీస్ ఖాళీగా ఉన్నాయన్నారు. అదేవిధంగా హరిపురం హైస్కూల్ లో ఫిజికల్ సైన్స్, హెూన్నాలి యూపీ స్కూలులో ఇంగ్లీష్ పోస్టు, కొరడాబడి యూపీ స్కూల్ లో ఇంగ్లీష్, గణితం, ఒరియా మీడియం పోస్టులు మంజూరు కాబడ్డాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోగా తమ దరఖాస్తులను మందస మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. పోస్టులు, అర్హతలు ఎంపిక విధానము ప్రభుత్వ నియమ, నిబంధనలు ప్రకారమే జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న



**పలాస, ఆగస్టు16 (వార్త):** స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని పురస్కరించుకుని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మారుతి షోరూం సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన లచ్చన్న ఉత్తరాంధ్ర రాజకీయ, సామాజిక చరిత్రలో చెరగని ముద్ర వేశారని, 1909 ఆగస్టు 16న బారువాలో సాధారణ గౌడ కుటుంబంలో జన్మించిన ఆయన విద్యార్థి దశలోనే జాతీయ భావాలకు ఆకర్షితులై స్వాతంత్ర్య సమరంలోకి అడుగుపెట్టారని తెలిపారు. మహాత్మాగాంధీ పిలుపుతో ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. ఉప్పు సత్యాగ్రహం నుంచి క్విట్ ఇండియా వరకు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయిన లచ్చన్న టెక్కలి, నరసన్నపేట సబ్‌జైళ్లలో, అనంతరం బరంపురం జైలులో శిక్ష అనుభవించారని అన్నారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు రాజమండ్రి జైలులో ఐదు నెలలు గడిపారని, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ఆయన పాత్రను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని, ఆయనను పట్టించిన వారికి బహుమతి ప్రకటించినప్పటికీ ఉద్యమాన్ని కొనసాగించారని అన్నారు. చివరకు అరెస్టై మూడేళ్లపాటు జైలు జీవితం గడిపి 1945లో విడుదలయ్యారని తెలిపారు. బడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన ఆయన స్వాతంత్ర్య పోరాటంతోపాటు సామాజిక సంస్కరణలకు లచ్చన్న ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అంటరానితనం నిర్మూలన, హరిజన సేవ, బడుగు వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. రాత్రి పాఠశాలలు నిర్వహించడం, దేవాలయ ప్రవేశం కోసం ఉద్యమించడం, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక మార్పుకు బాటలు వేశారని వెల్లడించారు. ఆచార్య ఎన్.జి. రంగా సన్నిహిత అనుచరుడిగా రైతాంగ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ రైతుల హక్కుల కోసం ఉద్యమించారని చెప్పారు. 1939లో పలాసలో జరిగిన కిసాన్ సభల నిర్వహణలో కీలక పాత్ర పోషించడం ద్వారా ఆయన పేరు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషిస్తూ స్వాతంత్ర్యం అనంతరం లచ్చన్న రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారని, మద్యపాన నిషేధం తదితర అంశాల్లో తన అభిప్రాయాలను బలంగా వినిపించారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రాల ఆవశ్యకతను సమర్థిస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కూడా మద్దతు తెలిపారు అన్నారు. అనంతరం రాజాజీ స్థాపించిన స్వతంత్ర పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు అధ్యక్షుడిగా వ్యవహరించారని, 1978లో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. సాహసం, కార్యదక్షత, పోరాట పటిమకు గుర్తింపుగా ప్రజలు గౌతు లచ్చన్నను 'సర్దార్'గా గౌరవించారని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమం నుంచి రైతాంగ, కార్మిక, బడుగు వర్గాల హక్కుల ఉద్యమాల వరకు ఆయన సాగించిన ప్రస్థానం ఉత్తరాంధ్ర ప్రజాజీవితంపై విశేష ప్రభావం చూపిందని, రాజకీయాలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి



**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సామాజిక అసమానతల నిర్మూలనకు, పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన విశేష కృషిని స్మరించుకున్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలో జన్మించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగరావుతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్దార్ లచ్చన్నకు ఘన నివాళి



**సోంపేట, ఆగస్టు 16 (వార్త):** స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న ఘాట్ వద్ద ఆయన తనయుడు మాజీమంత్రి గౌతు శ్యామసుందర్ శివాజీ అలాగే ఆయన సతీమణితో పాటు పలువురు టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ వద్ద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి లచ్చన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా లచ్చన్నకు సంబంధించిన నినాదాలు చేశారు. జోహార్ లచ్చన్న అమరహే అమరహే అంటూ నినాదాలతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్, బీన ఆనందరావు, చిత్రాడ శేఖర్, సూరాడ చంద్రమోహన్, దేవాడ మోహన్ రావు, రెల్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాకన్నపురంలో లచ్చన్నకు ఘన నివాళి



**సోంపేట, ఆగస్టు 16 (వార్త):** మాకన్నపురం గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 117 వ జయంతి ని ఘనంగా చేపట్టారు. ఏ ఎం సి చైర్మన్ మద్దిల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, ఉలాల హరికృష్ణ, నల్ల శ్యామలరావు, మద్దిల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమమే ఊపిరిగా.. పేదలే ప్రాణంగా!

**✻ సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి ✻ కిష్టపురంలో విగ్రహానికి పూలమాల వేసిన మాజీ మంత్రి గౌతు శ్యామ్‌సుందర్ శివాజీ**



**పలాస, ఆగస్టు 16 (వార్త):** పోరాటమే పథంగా.. ప్రజాసేవే శ్వాసగా.. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి గౌతు శ్యామ్‌సుందర్ శివాజీ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం పలాస మండలం కిష్టపురం గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే జీవన పథంగా మలుచుకున్న మహోన్నత వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. గళం విప్పితే గర్జనలా.. పిడికిలి బిగిస్తే పిడుగులా.. అన్యాయాన్ని ఎదిరించిన పోరాట యోధుడని తెలిపారు. సామాజిక అసమానతలు, నిరంకుశ విధానాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రజల హక్కుల కోసం అధికారాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన లచ్చన్న.. పదవుల కంటే ప్రజా ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. తన సిద్ధాంతాలకు కట్టుబడి రాజీలేని రాజకీయ జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. కళింగసీమలో పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.పేదల పక్షాన గళమెత్తిన యోధుడుసాధారణ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మహానేత లచ్చన్న అని శివాజీ అన్నారు. ఆయన ప్రసంగాలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ఆయన ఉద్యమాలు సామాజిక మార్పుకు బాటలు వేశాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చూపిన తెగువ, అన్యాయంపై ప్రదర్శించిన ధైర్యం, సామాజిక న్యాయం కోసం చేసిన నిరంతర పోరాటం నేటి తరానికి మార్గదర్శకమన్నారు. స్ఫూర్తి నింపిన సీమ సింహంగా సర్దార్ గౌతు లచ్చన్న పేరు వినగానే పోరాట పటిమ, ప్రజా ఉద్యమం, సామాజిక న్యాయం గుర్తుకొస్తాయని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వరకు ఆయన నిర్వహించిన పాత్రను స్మరించుకున్నారు. దేశభక్తి, ధైర్యం, ప్రజాసేవ, నిబద్ధత, పోరాట స్ఫూర్తిని జీవితాంతం ఆచరించిన లచ్చన్న ఆధునిక రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. లచ్చన్న జయంతిని కేవలం వేడుకగా కాకుండా ఆయన ఆశయాలను స్మరించుకునే సందర్భంగా భావించాలని పలువురు అన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ఆయన చూపిన మార్గంలో నేటి తరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కిష్టపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, రాష్ట్ర శాయన కమిటీ సభ్యుడు బూర్ల కృష్ణంరాజు, మండల టీడీపీ కార్యదర్శి దువ్వాడ సంతోష్ నాయుడు, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాదగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం

**✻ సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకం ✻ ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ నేత వజ్జ బాబూరావు ✻ విజయవాడలోబీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ✻ ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి ఉత్సవాలు**



**పలాస, ఆగస్టు 16 (వార్త):** బీసీల హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం జీవితాంతం పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు విజయవాడలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమం లచ్చన్న సేవా స్ఫూర్తిని, సామాజిక నిబద్ధతను మరోసారి గుర్తు చేసుకున్నారు.సర్దార్ గౌతు లచ్చన్న కేవలం రాజకీయ నాయకుడిగా కాకుండా బడుగు, బలహీన వర్గాల గొంతుకగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యం కల్పించేందుకు ఆయన సాగించిన పోరాటం ఆంధ్రప్రదేశ్ సామాజిక ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. విద్య, ఉపాధి, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆయన చేసిన కృషి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. వారసత్వాన్ని కొనసాగిస్తున్న శిరీషకార్యక్రమానికి సర్దార్ గౌతు లచ్చన్న మూడో తరం వారసురాలు, పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లచ్చన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా జీవితంలో ముందుకు సాగుతున్న శిరీష పాల్గొనడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లచ్చన్న చూపిన సామాజిక న్యాయం, ప్రజా సేవ, బడుగు వర్గాల అభ్యున్నతి మార్గంలో నేటి తరం ప్రజాప్రతినిధులు మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రముఖుల నివాళులు అర్పించారు. వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు, లచ్చన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.విశిష్ట అతిథిగాఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. బీసీల అభ్యున్నతి కోసం లచ్చన్న చేసిన పోరాటాన్ని ఆయన స్మరించుకున్నారు. మహనీయుల జయంతులను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా వారి ఆలోచనలు, ఆశయాలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆశయాల సాధనే నిజమైన నివాళిలచ్చన్న వంటి ప్రజానాయకుల సేవలను స్మరించుకోవడం అంటే వారి విగ్రహాలకు పూలమాలలు వేయడమే కాకుండా వారు కలలు కన్న సామాజిక న్యాయాన్ని ఆచరణలోకి తీసుకురావడమేనన్న అభిప్రాయం కార్యక్రమంలో వ్యక్తం చేశారు. బీసీలకు సమాన అవకాశాలు, విద్యా-ఉపాధి అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని వక్తలు ప్రస్తావించారు. జయంతి వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం రాష్ట్రప్రభుత్వం కల్పించిందని,రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహించడం ఆయన సేవలకు దక్కిన గౌరవంగా పలువురు పేర్కొన్నారు. లచ్చన్న జీవితం, ఆయన పోరాటాలు, సామాజిక నిబద్ధతను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేయాలనే సంకల్పాన్ని వేడుకలు చాటిచెప్పాయని పలువురు చెప్పారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# సేవకు పోలీస్ మెడల్

- సీఐ రామకృష్ణకు అరుదైన గౌరవం
- విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణకు గుర్తింపు
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం స్వీకరణ
- పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల అభినందనలు

**పలాస, ఆగస్టు 16 (వార్త):** విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, విశిష్ట సేవలకు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ గంధం రామకృష్ణకు ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. పోలీసు శాఖలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. కాశీబుగ్గ ఇన్‌చార్జ్ సీఐగా రామకృష్ణ అందిస్తున్న సేవలకు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడంతో స్థానిక పోలీసు వర్గాల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న సీఐ రామకృష్ణను పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ, క్రమశిక్షణ, నిబద్ధతకు ఈ పురస్కారం ప్రతీకగా నిలుస్తుందని సహచరులు పేర్కొన్నారు. ప్రజలకు భద్రత కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, బాధ్యతలను నిష్పక్షపాతంగా




నిర్వహించడం పోలీసు అధికారుల ప్రధాన కర్తవ్యాలని, వాటిని సమర్థంగా నిర్వర్తించే అధికారులకు లభించే పురస్కారాలు మరింత స్ఫూర్తినిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారికి ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కడం పలాస ప్రాంత పోలీసు శాఖకు గౌరవంగా నిలిచిందని సిబ్బంది పేర్కొన్నారు. రామకృష్ణకు లభించిన ఈ గుర్తింపు తోటి పోలీసు సిబ్బందిలోనూ మరింత ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు.

# ప్రతిభకు ప్రోత్సాహం

- విద్యార్థులకు నగదు పురస్కారాలు
- బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కారాలు

**పలాస, ఆగస్టు 16 (వార్త):** విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ ఎస్ సి 2025-26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కిక్కర ఢిల్లీరావు (కేడఅర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టాప్ పెర్ఫార్మర్స్‌కు మొత్తం రూ.20 వేల నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఎస్ఎస్ సి ఫలితాల్లో 566/600 మార్కులతో మద్దిల చాందిని ప్రథమ స్థానంలో నిలవగా, ఆమెకు రూ.5,000 నగదు బహుమతిని స్వర్గీయ బుద్ధ వెంకటరమణ (లెక్కల మాస్టర్) జ్ఞాపకార్థం కిక్కర ఢిల్లీరావు అందించారు. 564 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన వంకల లక్ష్మీ ప్రసన్నకు రూ.4,000ను స్వర్గీయ కిక్కర కామేశు జ్ఞాపకార్థం అందజేశారు. 563 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన సార అక్షితకు రూ.3,000ను స్వర్గీయ కుమారి కిక్కర అనన్య జ్ఞాపకార్థం అందజేశారు. 562 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచిన పాతిన మేఘనకు రూ.2,000ను స్వర్గీయ కిక్కర కర్రియ్య, గంగమ్మ దంపతుల జ్ఞాపకార్థం అందజేశారు. 560 మార్కులతో జడ్డే పూజ, మహేష్ మహరణ ఐదో స్థానంలో నిలవగా, ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున బహుమతులు అందజేశారు. ఈ నగదు బహుమతులను స్వర్గీయ మద్దిల అప్పన్న, అచ్చమ్మ దంపతుల జ్ఞాపకార్థం అందజేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన తెప్పల ప్రేమ్‌కుమార్ (555), బొనేలా కౌశిక్ (554), జడ్డే పల్లవి (549), మద్దిల ఝాన్సీ (547), గుమ్మడి గోపాలకృష్ణ (546), మురుపింటి అనిల్ (546)లకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సబ్జెక్టుల వారీగా ప్రోత్సాహకాలుపాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎస్. యర్రన్న గణితంలో 100/100 మార్కులు సాధించిన మద్దిల ఝాన్సీకి రూ.5,000 నగదు బహుమతి అందించారు. గణితంలో 95 నుంచి 99 మార్కులు సాధించిన మరో 14 మంది



విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సోషల్ సబ్జెక్టులో 95కుపైగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సోషల్ ఉపాధ్యాయుడు ఎస్. సూర్యారావు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలకు కుర్చీల వితరణ ఎంపీఎఫ్ పాఠశాలకు స్వర్గీయ గేదెల నోములరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి గేదెల కమల ఐదు ప్లాస్టిక్ కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీఎఫ్ స్కూల్ చైర్మన్ పోతనపల్లి దివ్య చిరంజీవి ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్షన్ సభ్యులు, పంచాయతీ పెద్దలు, వార్డు సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బొడ్డపాడు స్వర్ణ గ్రామ సిబ్బంది, ఎంపీఎఫ్, అంగన్వాడీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు గుర్తింపుగా కమిషనర్ శ్రీనివాసులకు ప్రశంసా పత్రం



**పలాస, ఆగస్టు 16 (వార్త):** ప్రజాసేవలో ప్రతిభ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు అరుదైన గౌరవం లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు పరిపాలనా వ్యవస్థను సమర్థంగా ముందుకు నడిపించడంలో కమిషనర్ శ్రీనివాసులు చూపిన చొరవ, అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పట్టణంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, ప్రజలకు అందాల్సిన మున్సిపల్ సేవలను మెరుగుపరిచేందుకు అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేయడం ఆయనకు ఈ గుర్తింపు లభించింది. సేవకు గుర్తింపుగా సిబ్బందిలో ఉత్సాహం నింపుతుందని, ప్రభుత్వ యంత్రాంగంలో అధికారులు అందించే సేవలకు ప్రజల నుంచి వచ్చే ఆదరణతో పాటు ఉన్నతస్థాయి నుంచి లభించే గుర్తింపు కూడా మరింత బాధ్యతను పెంచుతుందని పలువురు పేర్కొన్నారు. పలాస మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందడం మున్సిపల్ సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు భవిష్యత్తులో మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ప్రశంసా పత్రం లభించడంతో అభినందనలు తెలిపారు. ప్రశంసా పత్రం అందుకున్న కమిషనర్ శ్రీనివాసులను మున్సిపల్ సిబ్బంది, అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసే అధికారులకు లభించే ఇలాంటి గుర్తింపులు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని వారు పేర్కొన్నారు.

## బమ్మిడి అంబిక సేవలకు అవార్డు



**మందస, ఆగస్టు 16(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల భవిత కేంద్రంలో పనిచేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయురాలుగా సేవలందిస్తున్న బమ్మిడి అంబిక సేవలను జిల్లా అధికారులు గుర్తించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చేతుల మీదుగా అవార్డు అందించారు. అవార్డు అందుకున్న బమ్మిడి అంబికకు మండల విద్యాశాఖ అధికారులు, మరో సహిత విద్య ఉపాధ్యాయుడు కిల్లి ప్రసాదరావు, మండల విద్యాశాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## కృత్రిమ చేతులతో దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం



**శ్రీకాకుళం/విజయనగరం, ఆగస్టు 16 (వార్త):** కృత్రిమ చేతులు కోల్పోయిన దివ్యాంగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ఎల్ఎన్-4 కృత్రిమ చేతులు అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త కాంతులు నింపి ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించడమే లక్ష్యమని శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహన్ రావు పేర్కొన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, విజయనగరం రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'చేయూత' ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ శిబిరాన్ని నాయకులు పరిశీలించారు. అమెరికాకు చెందిన ఎలెన్ మెడికల్ ప్రోస్తెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో రూపొందించిన ఈ పరికరాలు దివ్యాంగులు తమ రోజువారీ పనులను స్వతంత్రంగా, సులభంగా చేసుకునేందుకు ఎంతో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 20 మంది లబ్ధిదారులకు ఎల్ఎన్-4 కృత్రిమ చేతులను అమర్చి, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ప్రతినిధులు స్పష్టం చేశారు. అర్హులైన దివ్యాంగులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని, లబ్ధిదారుల గుర్తింపు, కొలతల సేకరణ నుంచి పంపిణీ వరకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి.రామారావు, వైస్ చైర్మన్ పి.వి.రామచంద్ర రాజు, విజయనగరం రెడ్ క్రాస్ చైర్మన్ కంది వెంకటరమణ, శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ మేనేజర్ జి.రమణ, రోటరీ క్లబ్ ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

- రిటైర్డ్ ఎంఈఓ సుడియా సత్యనారాయణ

**పలాస, ఆగస్టు 16 (వార్త):** విద్యార్థులు చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకొని విద్యలో రాణించాలని రిటైర్డ్ ఎంఈఓ సుడియా సత్యనారాయణ అన్నారు. పలాస రామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి రంగంలోనూ పోటీ పెరిగిందని, విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇటువంటి పోటీలు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు.

### విజేతలు వీరే..

వక్తృత్వ పోటీల్లో కాశీబుగ్గ హైస్కూల్‌కు చెందిన పి.తేజస్విని ప్రథమ స్థానంలో నిలిచారు. టెక్కలిపట్నం హైస్కూల్‌కు చెందిన ధరణి ద్వితీయ, కాశీబుగ్గ హైస్కూల్‌కు చెందిన ప్రవలిక తృతీయ స్థానాలు సాధించారు. వ్యాసరచనలో టెక్కలిపట్నం సాయి స్కూల్‌కు చెందిన హిమాన్స్ ప్రథమ, కాశీబుగ్గ హైస్కూల్‌కు చెందిన నవ్యశ్రీ ద్వితీయ, నేహా తృతీయ స్థానాలు పొందారు. క్విజ్ పోటీల్లో బొడ్డపాడు, ఎర్రముక్కం, కొత్తపల్లి హైస్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి. వక్తృత్వ పోటీలో ప్రథమ విజేతగా నిలిచిన పి.తేజస్వినికి ఆదివారం బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉప్పాడ పాండురంగారావు, కార్యదర్శి తర్లన మోహనరావు, గౌరవ అధ్యక్షుడు బల్ల సుభాష్‌బాబు, సభ్యుడు జె.సి.హెచ్. శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మందస జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహం



**మందస, ఆగస్టు 16(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్ఎంఆర్ ఫౌండేషన్ ప్రోత్సాహం అందజేసింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతిభా పురష్కారాలను అందజేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం తెలుగు లెక్చరర్ గురుగుబెల్లి రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి. దేశ విముక్తికై సాగిన జాతీయ ఉద్యమంలో మల్లిపెద్ది కృష్ణమూర్తి, వడ్డి విశ్వనాథం, నూకల చంద్రయ్య, మార్పు పద్మనాభం, గానుగుల తరుణాచారి వంటి త్యాగధనుల దేశభక్తిని స్మరిస్తూ, వారి స్ఫూర్తిని రగిలించేలా వక్తలు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన నృత్య, సంగీత, క్విజ్, డిబేట్ పోటీలలో ప్రతిభ కనబరిచిన 50మంది విద్యార్థినీ విద్యార్థులకు ఎస్.ఎం.ఆర్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ పట్నాల మోహనరావుఆచారి అందించిన బహుమతులను ప్రకటించారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి డాక్టర్ పట్నాల మోహనరావు ఆచారి చేస్తున్న కృషిని అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# పలాసలో స్కేటింగ్ ఎంపికలు

- జిల్లా పోటీలకు 10 మంది క్రీడాకారుల ఎంపిక

**పలాస, ఆగస్టు 16 (వార్త):** పలాస మండల పరిధిలో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. స్థానిక గోపీచంద్ రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు నిర్వహించిన ఈ ఎంపికల్లో క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించారు. క్వాడ్, ఇన్‌లైన్, ఫ్యాన్స్ ఇన్‌లైన్ విభాగాల్లో జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇన్‌లైన్ విభాగంలో ఏ. అయాన్, ఎం. సుభాష్, ఎన్. పార్థసాయి, ఎస్. హిమంత్‌రాజ్, జి. తిషిని రాయ్ ఎంపికయ్యారు. క్వాడ్ విభాగంలో కే. బిందుప్రియ ప్రతిభ కనబరిచి అర్హత సాధించింది. ఫ్యాన్స్ ఇన్‌లైన్ విభాగంలో హర్షివ్ నాయుడు కే., డి. ప్రణీత్, నుక. చన్న, లోహన్స్ రెడ్డి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికల్లో క్రీడాకారుల వేగం, సమన్వయం, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, సమయపాలన వంటి అంశాలను పరిశీలించారు. స్కేటింగ్‌పై ఆసక్తి ఉన్న బాలబాలికలకు ఇటువంటి ఎంపికలు మంచి వేదికగా నిలుస్తున్నాయని గోపిచంద్ రోలర్ స్కేటింగ్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మరింత సాధన చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పలాస ప్రాంతంలో రోలర్ స్కేటింగ్‌కు విద్యార్థుల్లో ఆదరణ పెరుగుతుండటం గమనార్హం. స్థానికంగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించడం ద్వారా తమ ప్రతిభను మరింతగా చాటుకునే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి. చంద్రావతి, స్కేటింగ్ కోచ్ గోపాకృష్ణతో పాటు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొని ఎంపికలను ప్రోత్సహించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన తమ పిల్లలను తల్లిదండ్రులు అభినందించారు.





## ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

**అరసవల్లి, ఆగస్టు 16 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి ఆదివారం పెద్ద ఎత్తున బక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజే టికెట్లు రూపేనా రూ.1,95,000, పూజలు మరియు విరాళాల రూపంలో రూ.74,498, ప్రసాదాల రూపంలో రూ.130325, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు మరియు ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా మొత్తం రూపంలో రూ.1,12,543లు ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు.

# రూ.5 లక్షలతో ఎన్డీపీ ఎత్తిపోతల పథకం ఆధునికీకరణ

- ఎమ్మెల్యే కూన రవికుమార్
- నీలదేవిపురం ఆయకట్టుకు ఎత్తిపోతల పథకం ఆధునికీకరణ పనులు ప్రారంభం

**బూర్జ, ఆగస్టు 16 (వార్త):** బూర్జ మండలం నీలదేవిపురం గ్రామ రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఎన్డీపీ ఎత్తిపోతల పథకాన్ని రూ.5 లక్షల వ్యయంతో



ఆధునికీకరించామని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా నీలదేవిపురం గ్రామానికి సంబంధించిన సుమారు 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. ఆదివారం ఈ ఎత్తిపోతల పథకం ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ఆధునికీకరణతో రైతులకు సాగునీటి సమస్యలు తగ్గి, పంటల సాగుకు మరింత భరోసా కలగనుందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వ ప్రసాద్, డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ, మార్క్ఫెడ్ స్టేట్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ, నగరాల డైరెక్టర్ పిల్లా కన్నం నాయుడు, మండల అధ్యక్షులు రాంజీ, లంక జగన్నాథం నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# తంపర భూములు మత్స్యకారులకే లీజుకివ్వాలి

## క్రైం వార్తలు



## రైలు ఎక్కుతుండగా ప్రమాదం

**పలాస, ఆగస్టు 16 (వార్త):** పలాస రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు ఒడిశాలోని నౌగాం ప్రాంతానికి చెందిన బీమా బెహరా (30) పలాస రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డారు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అత్యవసర సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 పైలెట్ వెంకట్రావు, ఈఎంటీ సత్యం ప్రాథమిక చికిత్స అందించి క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలాస ప్రభుత్వ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థినిపై బ్లేడ్‌తో దాడి చేసిన యువకుడి అరెస్ట్

* మహిళలపై దాడులు ఉపేక్షించం
* మందస ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్



**మందస, ఆగస్టు 16(వార్త):** విద్యార్థినిపై జరిగిన దాడి సంఘటనపై పోలీసులు స్పందించారు. దర్యాప్తు చేశారు. కేసు నమోదు చేసి, నిందితునిపై చర్యలు తీసుకున్నారు. మందస ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేసి, నిందితుని అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్ఐ కృష్ణప్రసాద్ తెలిపిన పూర్వపరాలిలా ఉన్నాయి. మందస మండలానికి చెందిన ఓ విద్యార్థిని మందస జూనియర్ కళాశాలలో చదువుతోంది. అదే ప్రాంతంలోని చికిడిగాం గ్రామానికి చెందిన గౌడ రింటు అలియాస్ సింటు అనే యువకుడు ప్రేమ పేరుతో ఆ విద్యార్థిని వెంటపడుతున్నాడు. తెలంగాణాలోని హైదరాబాదులో పని చేస్తున్న చింటు పాత పరిచయాలను అడ్డం పెట్టుకుని, విద్యార్థినికి వేధిస్తున్నారు. ఇటీవల మందస బస్టాండ్లో ఆమె బస్సు కోసం వేచి చూస్తున్న సమయంలో రింటు ఆమె వద్దకు వెళ్లి, తనతో రావాలని బలవంతం చేశాడు. విద్యార్థిని అంగీకరించకపోవడంతో పక్కనే ఉన్న షాపులోకి వెళ్లి బ్లేడు కొనుగోలు చేశాడు. మళ్లీ ఆమె వద్దకు వెళ్లి బ్లేడుతో దాడి చేశారు. దీంతో ఆమె ఎడమ చేయి మణికట్టు వద్ద తీవ్రంగా గాయమైంది. ఆమె కేకలు వేయడంతో చింటు పారిపోయాడు. బాధితురాలిని మందస మండలంలోని హరిపురంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. దాడి చేసి పారిపోతున్న రింటును పట్టుకున్నారు. సంఘటన జరిగిన రెండవ రోజు అదుపులోకి పోలీసులు తీసుకున్నారు. అనంతరం పూర్తిస్థాయిలో విచారణ, దర్యాప్తు చేశారు. విద్యార్థినిపై దాడి చేసినట్టు పోలీసులు నిర్ధారించి, పలు కేసులు నమోదు చేశారు. 74, 78(1)(ఐ), 118(1) బీఎన్ఎస్ అండ్ సెక్షన్ 11 ఆర్/డబ్ల్యు 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 తదితర సెక్షన్లను గౌడ రింటు అలియాస్ సింటుపై నమోదు చేశారు. అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు.

### మహిళలపై దాడులు ఉపేక్షించం

మందస ప్రాంతంలో ఎన్నడూలేని విధంగా విద్యార్థినిపై దాడి జరిగింది. ప్రేమ పేరుతో విద్యార్థినిని గౌడ రింటు వేధించాడు. అంగీకరించకపోవడంతో దాడి చేశాడు. మహిళల రక్షణకు చట్టాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నిందితునిపై పలు సెక్షన్ లను వేశాం. మహిళలపై దాడులను ఉపేక్షించం. ఎంతటివారైనా చర్యలు తీసుకుంటాం. జైలుకు వెళ్తే.. బెయిల్ దొరకడం కూడా కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా యువత పెడదారిన పయనించకూడదు. అలా చేస్తే వారి జీవితాలు నాశనమవుతాయి. సక్రమైన మార్గంలోనే పయనించాలి. శాంతి, భద్రతలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని ఎస్ఐ కృష్ణప్రసాద్ హెచ్చరించారు.

## అనాధలకు అండగా.. మేమున్నాం



**సోంపేట ఆగస్టు 16 (వార్త):** సోంపేటకు చెందిన 1987-88 పదో తరగతి బ్యాచ్ మేమున్నాం స్వచ్ఛంద సంస్థగా ఏర్పడి అనాధల సేవలో అండగా నిలిచారు. సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో నివసిస్తున్న అనాధలకు సహాయం గా నిలిచారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 40 మందికి భోజనాలను ఏర్పాటు చేశారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ సహాయం పట్ల బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు తడక మాధవరావు, ఉపాధ్యక్షులు వాసుదేవ పానీగ్రహి, కార్యదర్శి నాగరాజు, తెలుకల కృష్ణ, పసుపురెడ్డి రాము, సాన మధు, కప్ప గోపీనాథ్, డివి రమణ తదితరులు పాల్గొన్నారు.

## బెహరా మనోవికాస కేంద్రానికి ఆర్థికసాయం

**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ సమీపంలో గల బెహరా మనోవికాస కేంద్రానికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.డా.ఎం.కె.మిశ్రో సందర్శించారు. కేంద్రం అభివృద్ధికి తనవంతుగా కొంత మొత్తాన్ని నిర్వాహకులు శ్యామల, విజయభాస్కర్‌లకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సుపేట ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.



* 1108 జీవోను రద్దు చేయాలి
* అక్రమ చేపల చెరువులను తొలగించాలి
* మత్స్యకారులు, పోరాట కమిటీ నేతలపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్



**సంతబొమ్మాళి, ఆగస్టు 16 (వార్త):** కాకరాపల్లి తంపర భూములకు సంబంధించిన 1108 జీవోను రద్దు చేసి, ఆ భూములను స్థానిక మత్స్యకారుల సొసైటీకి శాశ్వత ప్రాతిపదికన లీజుకు ఇవ్వాలని కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. మత్స్యకారులు, పోరాట కమిటీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన పోలీసు కేసులను తక్షణమే రద్దు చేయాలని కోరింది. వడ్డితాండ్రలోని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ దీక్షా శిబిరం 5,842 రోజులు పూర్తి చేసుకుని 17వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన సభలో పలు తీర్మానాలు చేశారు. కమిటీ అధ్యక్షుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి నంబారి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, రైతు సంఘం నాయకులు కోత మధుసూదనరావు, మత్స్యకార సొసైటీ నాయకులు పద్మనాభం, గన్ను, అనూరావు, ఖెత్రో, కేశవ, అడివమ్మ, హేమలత, దమయంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి రైతులు, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే విధానాలను పాలకులు అవలంబిస్తున్నారని ఆరోపించారు. థర్మల్ ప్రాజెక్టు కోసం కేటాయించిన భూముల విషయంలో బ్యాంకులు వేలం ప్రకటించి, ఒక ప్రైవేటు వ్యక్తికి రూ.190 కోట్లకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆ భూములను కాకరాపల్లి తంపరపై ఆధారపడి జీవిస్తున్న వడ్డితాండ్ర స్వదేశీ మత్స్యకారులకు లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కమిటీ అధ్యక్షుడు నంబారి వెంకట్రావు మాట్లాడుతూ.. కాకరాపల్లి తంపర భూముల్లో ప్రైవేటు వ్యక్తులు 100కు పైగా చేపల చెరువులు ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవనోపాధికి గండికొడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమ చెరువులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, మత్స్యకారులు, రైతులతో విస్తృత సమావేశం నిర్వహించి తదుపరి పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

## సీతక్కకు ఘన నివాళి

* సమసమాజ స్థాపనకు అంకితభావంతో పనిచేశారు
* సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ సహాయ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు




**పలాస, ఆగస్టు 16 (వార్త):** గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధురాలు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ సీతక్క మృతికి నివాళిగా పలాస మండలం బొడ్డపాడులో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు దొరకల బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ సీతక్క గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఆయుధ పోరాటంలో పాల్గొంటూ, కుటుంబ జీవితాన్ని సైతం పక్కనపెట్టి తన భర్త ధర్మన్నతో కలిసి అజ్ఞాత జీవితాన్ని గడిపారని చెప్పారు. సమసమాజ స్థాపన లక్ష్యంగా ఆమె అహర్నిశలు పనిచేశారని గుర్తుచేశారు. ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, సీతక్క అనారోగ్యంతో మృతి చెందడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని మాధవరావు అన్నారు. ఆదివాసీ ప్రజలతో మమేకమై వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఆమె నిరంతరం పోరాడారని తెలిపారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిన నిబద్ధత, పోరాట స్ఫూర్తి కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంతాప సభలు నిర్వహించి సీతక్క ఘనంగా నివాళులర్పించి న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీనియర్ నాయకురాలు సీతక్కకు నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా సంతాప సభలు నిర్వహిస్తున్నట్లు మాధవరావు తెలిపారు. ఆమె ప్రజా ఉద్యమాల్లో అందించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, ఏఐకేఎంఎస్ నాయకులు వంకల పాపయ్య, మామిడి భీమారావు, రాపాక మాధవరావు, మురిపిండి తాతారావు, అఖిలభారత ఆదివాసీ వేదిక నాయకుడు సవర బంగ్లా కుమార్, పీవైఎల్ జిల్లా కన్వీనర్ సారా జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నష్ట పరిహారాల పంపిణీలో ప్రభుత్వానికి ద్వంద్వ నీతి

* ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు పక్షపాత ధోరణి
* కక్షపూరిత రాజకీయాలను మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి
* వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల వింగ్ ప్రధాన కార్యదర్శి మార్పు వెంకటరమణ



**మందస, ఆగస్టు 16(వార్త):** ప్రమాదాలలో నష్ట పరిహారం మంజూరులో ద్వంద్వ నీతి తగదని, ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల వింగ్ శ్రీకాకుళంజిల్లా ప్రధాన కార్యదర్శి మార్పు వెంకటరమణ(క్రిష్ణ) అన్నారు. మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కక్షపూరిత రాజకీయాలను మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. దానయ్య కుటుంబానికి టీడీపీ రూ.10 లక్షలు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అందజేసిన ఐదు లక్షల రూపాయలతో పాటు ఆర్థిక సహాయాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ మంచి పనికి అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా టీడీపీకి ఒక ప్రశ్న వేస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రమాద బాధితులందరికీ వారి ఆర్థిక పరిస్థితులు బట్టి ఆర్థిక సహకారం అందిస్తారా? లేదా ప్రమాదం చేసిన వారి స్థాయి అంటే ప్రతిపక్ష పార్టీ, వైఎస్ఆర్సిపి నాయకులు ద్వారా ప్రమాదాల జరిగితే ఈ ఆర్థిక సహాయం అందిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికార పార్టీ పలాస నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రాజకీయాలు అప్రజాస్వామికం, అనైతికం, కుట్ర, కక్షపూరితమని, వీటిని ప్రతీ ఒక్కరూ ఖండించాలన్నారు. టీడీపీ పార్టీ జాతీయ పార్టీ అని చెప్పుకుంటుందని, ఆ పార్టీకి ఒక విధానం ఉండాలన్నారు. అందులోనూ అధికారంలో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలల్లో జరిగిన యాక్సిడెంట్లు లో ఎంతో మంది చనిపోయారు.. టిడిపి వారిలో ఎంత మందికి 10 లక్షల రూపాయలు సహకారాన్ని అందించింది.. అనేది వారు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కనీసంగా పలాస నియోజకవర్గంలో లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ, పిడుగుపాటుకు గురైన పాతకోట, పెండంగో గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు సవర జొర, కట్ట సొముద్రి కుటుంబాలకైనా ఆర్థిక సహకారం ప్రకటించారా? దీనిపై ప్రజలు ప్రజాస్వామికవాదులు, వివిధ రాజకీయ పార్టీలు ముఖ్యంగా కూటమిలో భాగమైన జనసేన, బీజేపీ పార్టీలు ప్రశ్నించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా పలాస నియోజకవర్గం లో అప్రజాస్వామిక, కుట్ర, కక్ష పూర్తి రాజకీయాలను అందరూ ఖండించాలన్నారు. దానయ్య కుటుంబానికే కాదు ప్రమాదం, పకృతి వైపరీత్యాలలో జరిగిన నష్టాలకు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకుడు డాక్టర్ అప్పలరాజు ఆర్థిక హార్థిక సహకారంలో ముందే ఉంటారన్నారు. వైఎస్సార్సీపీ దానయ్యతో పాటు అందరూ బాధితులకు తగిన సహకారం అందజేస్తామన్నారు.

## విద్యార్థినులు బాధ్యతాయుతంగా మెలగాలి

* సమాజంలో మంచి చెడులను గుర్తించాలి
* కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని
* గిరిజనులకు గొడుగులు అందజేసిన డీఎస్పీ




**మందస, ఆగస్టు 16(వార్త):** నేటి సమాజంలో మంచి చెడులను గుర్తించి ముందుకు వెళ్లాలని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని సూచించారు. మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొండలోగాం పంచాయతీ పట్టులోగాంలో గల ప్రభుత్వ గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భవాని విద్యార్థినిలనుద్దేశించి మాట్లాడుతూ చక్కగా చదువుకుని మంచి మార్కులు తీసుకురావాలని హితవు పలికారు. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి, మీపై ఆశలు పెట్టుకుని చదివిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలకు సార్థకత తీసుకురావాలన్నారు. గురువుల మాటను జవదాటవద్దన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న చెడులను నిశితంగా పరిశీలించి, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ చట్టాలు, వాటి ప్రభావం, మహిళలకు రక్షణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, ఆపద సమయాల్లో కాపాడే యాప్ లు, ఫోన్ నంబర్లు ను విద్యార్థినిలకు



వివరించారు. అదేవిధంగా మొబైల్ వినియోగం తగ్గించుకోవాలని, పుస్తక పఠనం చేయాలన్నారు. పోటీతత్వం, అంకితభావం, కృషి, పట్టుదలతోనే విజయం సాధించగలరన్నారు. గిరిజన విద్యకు ప్రభుత్వం రూ.కోట్లు వ్యయం చేస్తోందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం గిరిజన విద్యార్థినిల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటన్నర సేపు డీఎస్పీ భవాని విద్యార్థినిలతో ఆమె గడిపారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో కూడా మాట్లాడి, గిరిజన బాలికోన్నత ఆశ్రమం అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికలను వివరించారు. ఆశ్రమ పాఠశాలలో సీసీ కెమేరాలు లేవని గుర్తించిన డీఎస్పీ భవానీ తక్షణమే రెండు సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించగా.. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ వాటిని ఏర్పాటు చేస్తామని అంగీకరించారు. గిరిజనులకు గొడుగులు అందజేసిన డీఎస్పీ భవాని పట్టులోగాంలో గిరిజనులతో జరిగిన సమావేశంలో డీఎస్పీ టి. భవాని మాట్లాడారు. గిరిజనుల సమస్యలుంటే పోలీసులకు తెలియ జేయాలన్నారు. నిత్యం పోలీసులు అందుబాటులో ఉంటారని, శాంతి భద్రతల రక్షణలో పని చేస్తారన్నారు. పల్లెలు ప్రశాంతతకు నిలయాలని, గిరిజనులు శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం వృద్ధులు, పేదలకు గొడుగులను అందజేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## కొత్తపేటలో ఇంటింటికీ తెలుగుదేశం



**మందస, ఆగస్టు 16(వార్త):** మందస మండలంలోని లొహరిబంద పంచాయతీ కొత్తపేట గ్రామంలో క్లస్టర్ ఇన్ చార్జి దాసరి తాతారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష ఆదేశానుసారం క్లస్టర్ ఇంచార్జి దాసరి తాతారావు ఆధ్వర్యంలో నిర్వహించి, ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్ చార్జి కుప్పిలి వెంకటరావు, బూత్ కన్వీనర్ ధర్మాన తవిటయ్య, కోకన్వీనర్ ఆడతాల సోమేశ్వరరావు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన తల్లి.. తనయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 16 (వార్త):** వియత్నాంలో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన తల్లి, తనయుడు సత్తాచాటారు. భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష, ఆమె కుమారుడు కారే మోక్షిత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. 42 ఏళ్ల వయస్సు కేటగిరీ పూమ్‌సే విభాగంలో డాక్టర్ శిరీష స్వర్ణ పతకం సాధించగా.. క్యాడెట్ విభాగంలో కారే మోక్షిత్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. వీరికి కొమర మోహనకృష్ణ శిక్షణ అందించారు. రెండో తైక్వాండో సూంగ్ రీ ఛాంపియన్‌షిప్ పోటీలు జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు వియత్నాంలో జరిగాయి. అంతర్జాతీయ స్థాయిలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తనయుడు పతకాలు సాధించడంతో జిల్లాకు పేరు తీసుకువచ్చారని పలువురు అభినందించారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో అభినందన సభ నిర్వహించారు. డాక్టర్ శిరీష, కారే మోక్షిత్, కోచ్ కొమర మోహనకృష్ణలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, ప్రముఖ గ్యాస్ట్రాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధర్, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత, రిమ్స్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కారే సంజీవకుమార్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, గేదెల లక్ష్మి, సుగంధం సంజీవరావు, గుడ్ల గోపాలరావు, వాసంతి, కృష్ణారావు, ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హారిక ప్రసాద్, రాజేష్, రెడ్డి సాయిరాం, తామాడ లోకేష్, తైక్వాండో శిక్షకులు లక్ష్మణ్, కొమర మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546